

# సంగారెడ్డి మెదక్

శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:12



## నల్లవాగు చివరి ఆయకట్టుకు సాగునీరు విడుదల

కాల్వల్లో పూడిక, పొదల తొలగింపుతో సాఫీగా నీటి ప్రవాహం 02

# ప్రజల సంక్షేమమే ప్రజాపాలనకు ప్రధాన లక్ష్యం

### - రాందాస్ చౌరస్తాలో
### - జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు











**మెదక్ (ప్రజాజ్యోతి)**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలనను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరమే అందేలా కృషి చేయడమే ప్రజాపాలన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సహకారంతో ముందుకు సాగుతానని రోహిత్ రావు తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉండే పాలనే నిజమైన ప్రజాపాలనఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.

మిగతా 2 లో

# ప్రజల సంక్షేమమే ప్రజాపాలనకు ప్రధాన లక్ష్యం







ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపే విధంగా పాలన కొనసాగాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.మెదక్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు తదితర రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని రోహిత్ రావు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

### కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్ రావు

మెదక్ కలెక్టరేట్‌లోని ఐ డి ఓ సి లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొని ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో పాలన అందించడమే ప్రజాపాలనకు అసలైన అర్థమన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.మెదక్ జిల్లా అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని రోహిత్ రావు పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పాలన కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు.

### దివ్యాంగులకు అండగా ప్రభుత్వం సహాయక పరికరాల పంపిణీ

ఐ డి ఓ సి లో దివ్యాంగులకు సహాయక పరికరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుమెదక్ కలెక్టరేట్‌లోని ఐ డి ఓ సి లో దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎమ్మెల్యే



డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు హాజరై దివ్యాంగులకు సహాయక పరికరాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు అవసరమైన సహకారం అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. సహాయక పరికరాలు వారి రోజువారీ జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని, వాటిని సద్వినియోగం చేసుకుని స్వావలంబన దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని రోహిత్ రావు తెలిపారు. దివ్యాంగుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, దివ్యాంగులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### అనంతరం మెదక్ లో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి ఉత్సవంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ ఛైర్పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,టౌన్ అధ్యక్షుడు యం గంగాధర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్

**మునిపల్లి సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):**

మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్ తో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను హాస్పిటల్లో పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, నాయకులు రమేష్ గౌడ్, విద్యార్థి సంఘం నేతలు అర్జున్, లక్ష్మణ్ తది తరులు పాల్గొన్నారు.





# నల్లవాగు చివరి ఆయకట్టుకు సాగునీరు విడుదల

**కల్హేర్, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి):**

కల్హేర్ మండలం కృష్ణాపూర్, ఇందిరానగర్ పరిసర ప్రాంతాల్లోని నల్లవాగు ప్రాజెక్టు చివరి ఆయకట్టు భూములకు అధికారులు సాగునీరు విడుదల చేశారు. కాల్వల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న పొదలు, పూడికను జేసీబీల సహాయంతో తొలగించడంతో ప్రస్తుతం నీరు సాఫీగా చివరి ఆయకట్టు ప్రాంతాలకు చేరుతోందని అధికారులు తెలిపారు.నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా ప్రస్తుతం 140 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నీరు చివరి ఆయకట్టుకు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు కీలక సమయంలో సాగునీరు అందడంతో ఎండిపోతున్న పంటలకు ఉపశమనం లభించిందని రైతులు పేర్కొన్నారు.కాల్వల్లో పేరుకుపోయిన పూడిక, పెరిగిన పొదల కారణంగా నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతుండటంతో వాటిని తొలగించడంపై అధికారులు దృష్టి సారించారు. ఇకపై చివరి ఆయకట్టు వరకు నీటి ప్రవాహం నిరంతరంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు..



# త్యాగాల స్ఫూర్తితో సమైక్యతను కాపాడుకుందాం

## - జాతీయ సమైక్యతా దినోత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి.







మెదక్ (ప్రజాజ్యోతి)

భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ దేశ సమైక్యతను మరింత బలోపేతం చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ప్రాంగణంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి, పార్టీ జెండాను కూడా ఎగరవేశారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాచరిక పాలన నుంచి తెలంగాణ ప్రజాస్వామిక వ్యవస్థలోకి అడుగుపెట్టిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం ఆనాడు తెలంగాణ సమాజం సాగించిన పోరాటం, యోధుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.సమైక్యత అంటే సరిహద్దులు కలవడం మాత్రమే కాదు.. మనసులు కలవడం అని అన్నారు. ప్రజల మధ్య ఐక్యత, విభిన్న సంస్కృతుల మధ్య సామరస్యం, పరస్పర గౌరవం కొనసాగినప్పుడే దేశ సమైక్యత మరింత బలపడుతుందని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ప్రత్యేకత అని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చాకచక్యంతో సంస్థానాల విలీనం జరిగి దేశం ఏకీకృతమైందని వివరించారు. ఆనాటి మహనీయుల స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, మెదక్ జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ. ఆంజనేయులు, కౌన్సిలర్ జుబేర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు అంకం చంద్రకళ, మెంగాని విజయలక్ష్మి భీమరి కిషోర్, మాయ మల్లేశం, మెదక్ & హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు ఎం. అంజగౌడ్,సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు,మాజీ సర్పంచ్ లు , మెదక్ పట్టణ,మండల నాయకులు,బిఆర్ఎస్వి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించాలి

## మెదక్ ఎంపీ రఘునందన్ రావు





మెదక్ (ప్రజా జ్యోతి)



దివ్యాంగులు ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో జీవించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచించారు. గురువారం మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన దివ్యాంగుల సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించడం గొప్ప కార్యక్రమమన్నారు. గత ఆరు నెలల్లో 461 మంది దివ్యాంగులను గుర్తించి, వారికి 850 సహాయ పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో దివ్యాంగ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి దేశానికి పతకాలు సాధించారని పేర్కొన్నారు. దివ్యాంగులు ఎవరికీ తక్కువ కాదని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదంగా, స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన సహాయాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వారికి అందుబాటులో ఉండేలా అడ్డంకులు లేని, సమగ్ర, సౌకర్యవంతమైన సమాజ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్నరు కార్యక్రమాల్లో భాగంగానే ఇటువంటి శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, సహాయ పరికరాల పంపిణీ ద్వారా దివ్యాంగుల చలనశీలత, వినికిడి సామర్థ్యం, దైనందిన కార్యకలాపాల్లో స్వయం ఆధారితత మెరుగుపడటంతో పాటు వారి ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

## - విశ్వకర్మల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి వివేక్ వెంకటస్వామి

## - విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

## - ఏటీసీలలో కోర్సులు, రాజీవ్ యువ వికాసంలో అవకాశాలు













**మెదక్ (ప్రజాజ్యోతి)**

విశ్వకర్మల సంక్షేమమే ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని కార్మిక, గనుల భూగర్భ శాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విశ్వకర్మల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో మంత్రి పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద నిర్వహించిన భగవాన్ విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ:**

సాంకేతిక అభివృద్ధి: విశ్వకర్మలు ఆధునిక నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.శిక్షణ & అవకాశాలు: ఐటీఐ/ఏటీసీలలో విశ్వకర్మల కోసం ప్రత్యేక కోర్సులు ప్రారంభించేలా సిఫారసు చేస్తామని, రాజీవ్ యువ వికాసంలో విశ్వకర్మలకు తగిన అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ మించె నగేష్, ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ ఛైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ ఛైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ శివరామకృష్ణ, కాళికాదేవి ఆలయ ప్రధాన అర్చకులు శివరామాచార్యులు, గంగా భవాని ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ చారి, ప్రముఖ వైద్యులు డాక్టర్ నవీన్ చారి, పంచాయతీ రాజ్ ఎస్ఈ నరింలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

## - సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 17:**



పాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శివ్వంపేట మండలంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని,విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు.విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బుచ్చా నాయక్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి,సంతోష్ గుప్తా,వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.జిల్లా స్పోర్ట్స్ అధికారి రమేష్ హాజరయ్యారు.

# కుమారుడి జ్ఞాపకార్థం విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

## - జన్మదినం సందర్భంగా ఏటా సేవా కార్యక్రమాలు

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 17:**



శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు.తూప్రాన్‌లోని సాయిబాబా ఆలయ ట్రస్టు మేనేజ్‌మెంట్ కార్యనిర్వాహకుడు రవినాథ్ తన కుమారుడి జ్ఞాపకార్థం,ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని అందించారు.తన కుమారుడు మృతి చెందిన అనంతరం,ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం కుమారుడి జన్మదినం సందర్భంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రవినాథ్ తెలిపారు.అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన ఏకరూప దుస్తులను విద్యార్థులకు గ్రామ సర్పంచ్ గజేంద్రుల మమతనర్సింలు, ఏఎంసీ చైర్మన్ గజేంద్రుల భవాని చేతుల మీదుగా పంపిణీ చేశారు.కార్యక్రమంలో గ్రామ వీఓఏ లత,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం,ఉపాధ్యాయురాలు కవిత,పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం
















**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

ప్రజా పాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణం లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అధిథి గా తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజర య్యారు.ఈ సందర్బంగా జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్. పి పరితోష్ పంకజ్ పాల్గొన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రజలకు పారద ర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రజా పాలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, వారి సమస్యలను తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన వారు వాటి ప్రయోజనాలను పొందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్బంగా దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాల పంపిణీ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.తెలంగాణ దివ్యాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో, గ్లోబల్ గ్రీన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, సంగారెడ్డి వారి సహకారంతో సుమారు రూ.13.10 లక్షల విలువ గల బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు, బ్యాటరీ ఆటోలను దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మొత్తం 21 బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్ల యూనిట్లు, ఒక బ్యాటరీ ఆటోను దివ్యాంగులకు అందజేశారు.దివ్యాంగులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు సహాయ పరికరాల పంపిణీ దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం, వివిధ సంస్థల సహకారంతో అర్హులైన దివ్యాంగులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని లలిత



కుమారి తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం

## - హాజరైన ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి న్యూస్)**

పట్టణ మున్సిపల్ కార్యాలయంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా చేపట్టాల్సిన చర్యలు, పారి శుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతా వరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహిం చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులకు అవసరమైన సహకారం అందిస్తూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే మండపాల కమిటీ సభ్యులు కూడా అధికారులకు పూర్తిగా సహకరించి, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, విజయ వంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మాణిక్ రావు కోరారు.





# రైతులకు నాణ్యమైన 24 గంటలు విద్యుత్ అందించాలి

## మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

## - బి కాంగ్రెస్ వచ్చింది కరెంట్ కష్టాలు తెచ్చింది





**మెదక్ (ప్రజా జ్యోతి)**

పెద్ద శంకరంపేట పట్టణంలో రోడ్డుపై ధర్నా నిర్వహించారు రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది రైతు పంట పండిస్తూనే ప్రజలకు అన్నం దొరుకుతుంది అలాంటి రైతన్నకు సాగునీరు అందించే బోరు మోటార్లకు సక్రమమైన విద్యుత్ అందాక పోతే పంటలు ఎలా పండుతాయి రైతు ఎలా బతుకుతారు రైతులకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలపై రోడ్డుపై ధర్నా నిర్వహించి ప్రభుత్వంపై త్రీవ స్థాయిలో ప్రశ్నించారు కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవడం నాణ్యమైన విద్యుత్ అందకపోవడం వల్ల రైతులు తమ బోరు మోటార్లను నడుపుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులు విద్యుత్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని భూపాల్ రెడ్డి గారు ఆవేదన వ్యక్తం చేశారు రైతు పొలంలో పంట ఉంది బోర్ లో మోటర్ ఉంది కానీ మోటర్ నడిపేందుకు కరెంటు లేకపోతే ఆ రైతు పరిస్థితి ఏమిటి? రైతులు అప్పులు చేసి విత్తనాలు ఎరువులు మందులు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు పంట చేతికొచ్చి సమయంలో విద్యుత్ సరఫరా లో అంతరాయాలు ఏర్పడితే రైతు పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయే ప్రమాదం ఉంది అందుకే విద్యుత్ సమస్యను చిన్న సమస్యగా చూడకుండా ప్రభుత్వం తక్షణమే పరీక్షించాలని భూపాల్ రెడ్డి గారు డిమాండ్ చేశారు రైతులకు 24 గంటలు విద్యుత్తు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఎందుకు పరీక్షించడం లేదు రైతుల బోర్ మోటార్రు సక్రమంగా పనిచేయకపోతే పంటలు ఎండిపోతుంటే స్థానిక ఎమ్మెల్యే గారు ఎందుకు స్పందించడం లేదు రైతుల సమస్యలు చెప్పుకోవడానికి ధర్నాలు ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది ప్రజలు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించింది సమస్యలు రైతులకు న్యాయమైన విద్యుత్ ఇవ్వాలి 24 గంటలు విద్యుత్ సరఫరాను సక్రమంగా తమలు చేయాలి రైతుల పంటలను కాపాడాలి అని ఆయన డిమాండ్ చేశారు ఇకనైనా ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి శంకరంపేట ప్రాంతంలోని విద్యుత్ సమస్యలను తక్షణమే పరీక్షించాలని కోరారు రైతుల సమస్యలను పరీక్షించడంలో ప్రభుత్వం విఫలమైతే టిఆర్ఎస్ పార్టీ రైతుల తక్షణ మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని భూపాల్ రెడ్డి గారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్ టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రైతులు భారీ సంఖ్యలో పాల్గొని రైతుల విద్యుత్ సమస్యలపై తమ నిరసనను వ్యక్తం చేశారు

# జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాణిక్ రావు

## - తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు

## - ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు

**జహీరాబాద్, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి న్యూస్)**

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. తెలంగాణ ప్రజల ఐక్యత, సోదరభావం, ప్రజాస్వామ్య విలువలను చాటిచెప్పే ఈ రోజును ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకో వాలని ఆయన పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నుంచి నేటి వరకు రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడిన ఉద్యమ కారులు, అమరవీరులు, ప్రజల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకో వాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమానం, హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు సహా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఐక్యత తెలంగాణ ఆత్మగౌరవం తెలంగాణ అభివృద్ధి అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని



ఎమ్మెల్యే మాణిక్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు,మాజి మున్సిపల్ చైర్మన్ తంజిం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్, కౌన్సిలర్ లు అబ్దుల్లా, మహిపాల్, గౌస్ గోరి, జాకీర్, పాండు, విశ్వేశ్వర్, ప్రవీణ్, దీపక్, నాయకులు జె రవికిరణ్, బరూర్ దత్తాత్రి, గణేష్, చంద్రయ్య, ఫయాజ్, మొహమ్మద్ అలీ, ఇబ్రహీం, ఇంద్ర రెడ్డి, విజయ్ రాథోడ్,



మధు తదితరులు పాల్గొన్నారు.

# విమోచన స్ఫూర్తితో ముందుకు సాగాలి

## - జోగిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం

## - ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు.. మిఠాయిల పంపిణీ





**అందోల్, సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందని, నాటి పోరాటాల్లో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ అందోల్-జోగిపేట అధ్యక్షురాలు మహేష్కర్ పావని అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నైజాం, రజాకార్ల పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిన రోజును స్మరించుకుంటూ అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. నాటి రజాకార్ల పాలనలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు అనేక ఇబ్బందులు, చిత్రహింసలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ విముక్తి ప్రక్రియలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని, ఆయన సేవలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు.

### మోదీ జన్మదిన వేడుకలు

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని జోగిపేటలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలు కలగాలని, దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని మహేష్కర్ పావని ఆకాంక్షించారు. అనంతరం టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు రత్నపూరి జగన్నాథం, మాజీ అందోల్ అసెంబ్లీ కన్వీనర్ ప్రభాత్, సీనియర్ నాయకుడు జోగినాథ్, అందోల్ నియోజకవర్గ కో-కన్వీనర్ మహేష్కర్ సుమన్, జోగిపేట ప్రధాన కార్యదర్శి మేదరి పాపయ్య, నవాబ్‌గారి భూమయ్య, హరీష్, ప్రభాకర్, ఆంజనేయులు, లక్ష్మణ్, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను వక్రీకరించొద్దు!

## - తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని మతపోరాటంగా చిత్రీకరించడం తగదు

## - పోరాట వారసత్వాన్ని ప్రజలు కాపాడుకోవాలి: సీపీఎం నేత అతిమేల మాణిక్

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. విమోచనం పేరుతో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో కొండాపూర్ మండలంలోని గంగారం గ్రామం నుంచి కొండాపూర్ బస్టాండ్ వరకు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న అతిమేల మాణిక్ మాట్లాడుతూ, నాటి నిజాం, రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి, దొరలు, జాగీర్దారులు, పటేల్‌పట్వారీ వ్యవస్థల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని అన్నారు. ఈ పోరాటం ద్వారా పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదేనని మాణిక్ పేర్కొన్నారు. సాయుధ రైతాంగ పోరాటంతో ఆర్ఎస్ఎస్, బీజేపీకి సంబంధం లేదని ఆయన అన్నారు. చారిత్రక పోరాటాన్ని హిందూముస్లిం ఘర్షణగా చిత్రీకరించడం సరికాదని, నాడు మతాలకు అతీతంగా ప్రజలు ఐక్యంగా పోరాడారని తెలిపారు. దొరలు, జాగీర్దారులు, పటేల్‌పట్వారీలు ప్రజలపై పన్నుల భారం మోపడంతో పాటు వెట్టిచాకిరి చేయించారని, దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోరాటం సాగిందని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ




సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని వివిధ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మాణిక్ ఆరోపించారు. ప్రజలను మత ప్రాతిపదికన విభజించే రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత పాలకులు ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు అందడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కే. రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, నాయకులు అంజయ్య, ఎల్లేష్, రాజు, అనిల్, వెంకటేశం, కృష్ణ, విజయ్, హరీష్, జస్వంత్, ఉదయ్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ పి ఓ లో సభ్యత్వంతో రైతులకు మేలు

**హత్నూర 17సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**

రైతు ఉత్పత్తిదారుల సంస్థ లో చేరే రైతులు భవిష్యత్తులో అనేక లాభాలు పొందే అవకాశం ఉంటుందని హత్నూర పిఎసిఎస్ చైర్మన్ దుర్గారెడ్డి అన్నారు. గురువారం నాడు మండలంలోని కొన్యాల గుండ్ల మాచునూర్ గ్రామాలలో కొనసాగుతున్న సభ్యత్వ నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ పి ఓ సభ్యత్వం కలిగి ఉన్న రైతుల పంట పొలాలలో మట్టి నమూనాలు సేకరించి వారికి తగు సలహాలు సూచనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా ఎరువుల పంపిణీ సమయంలో కూడా రైతులకు ప్రాధాన్యతను ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఎఫ్ పి ఓ ద్వారా చేసే వ్యాపారాలలో వచ్చే లాభాన్ని సభ్యుల ఆమోదంతో మరింత ముందుకు పోయే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీహరి, వార్డు సభ్యులు బద్రేశ్ నాయకులు వెంకటేశం అశోక్, నర్సింలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# కాసాలలో ఘనంగా భగవాన్ బలరాముని జయంతి వేడుకలు

**హత్నూర 17 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**

శ్రీ భగవాన్ బలరాముని జయంతి సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో హత్నూర మండలంలోని కాసాల గ్రామంలో బలరాముని చిత్రపటానికి పూలమాలవేసి బలరాముని జయంతి( వ్యవసాయ దినోత్సవం)ని గురువారం ఘనంగా నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షులు నాయకులు బారాది నర్సింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వాగుల గడ్డ మల్లారెడ్డి, గ్రామ అధ్యక్షులు మురళి, రామ్ రెడ్డి, వెంకటేశం గుప్తా లు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతుల ఆరాధ్య దైవం బలరాముని జయంతిని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కల్తీ లేని సేంద్రియ వ్యవసాయ సాగుకు రైతులు సన్నద్ధమయ్యేలా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామం నుంచి మొదలు రాష్ట్ర స్థాయి వరకు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయునట్లు పేర్కొన్నారు. అనంతరం ఎడ్ల బండి ఉపయోగిస్తూ పశువులను ఆవులను పోషణ చేస్తూ వ్యవసాయం చేస్తున్న రైతులను శాలువాతో సన్మానించి బలరాముని చిత్రపటాన్ని అందజేశారు. అంతకుముందు భారతీయ కిసాన్ సాంఘ్ జెండాను ఆవిష్కరించి, గోవుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్లు వెంకటేష్ గౌడ్, నర్సింహారెడ్డి, అరుణ్ గౌడ్, గంగయ్య, బబ్బురి వెంకటేశ, సుభాష్, ఆంజనేయులు, రైతులు, బక్క శ్రీశైలం, మహేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాజ్యోతి
శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

# రాబోయే రెండేళ్లలో వైద్య రంగంలో దేశంలోనే అగ్రస్థానంలో సంగారెడ్డి మెడికల్ కళాశాల

## - మంత్రి దామోదర్ రాజనర్సింహ


















**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

రాబోయే రెండేళ్లలో సంగారెడ్డి జిల్లా మెడికల్ కళాశాలను వైద్య విద్య, వైద్య సేవలు, మౌలిక వసతుల పరంగా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.గురువారం సంగారెడ్డి మెడికల్ కళాశాల ప్రాంగణంలో హెటిరో ఫౌండేషన్ సౌజన్యంతో రూ.1.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్, క్రికెట్, కబడ్డీ కోర్టులు, ఓపెన్ క్రికెట్ గ్రౌండ్‌ను టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం వైద్య విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. వైద్య విద్యార్థులు ,చదువులో మంచి ర్యాంకులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే వైద్యం, విద్య, సాధికారత, సామాజిక భద్రత వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన వైద్య సదుపాయాలతో ఆసుపత్రుల నిర్మాణ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. సుమారు రూ.500 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలు కలిగిన ఆసుపత్రుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు, ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తెలంగాణను వైద్య రంగంలో దేశంలోనే ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.భవిష్యత్తులో వైద్యులుగా ఉన్నత స్థాయికి ఎదిగినప్పటికీ సమాజం పట్ల బాధ్యతను మరువరాదని మంత్రి అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వాలు, నాయకత్వాలు శాశ్వతం కావని, ప్రజలకు నిరంతరం సేవలందించేలా వ్యవస్థలను బలోపేతం చేయడమే ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. వైద్య విద్య పూర్తయిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని, సమాజ సేవ ద్వారా మంచి గుర్తింపు పొందవచ్చని అన్నారు.ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ ,సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను మంత్రి పంపిణీ చేశారు. సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 700 మంది రోగులకు నెలకు ఒక కిట్ చొప్పున వరుసగా 6 నెలల పాటు ఉచితంగా పోషకాహార కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు . క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు, ఇతర సంస్థల సహకారం అవసరమని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశరావు, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, హేటిరో ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్, మెడికల్ కళాశాల విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగూర్ కెనాల్ , పెద్దరెడ్డిపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేయాలి

## - మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

జిల్లాలో నీటిపారుదల పనులు, వ్యవసాయ రంగానికి నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం ,సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులు, డ్యామ్‌ల భద్రత, తనిఖీ నివేదికలు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ నివేదికలపై సమీక్షించారు. సింగూర్ కెనాల్, పెద్దరెడ్డిపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పంటలు సాగు చేసిన రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా, అలాగే ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లాలో తాగునీటి అవసరాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల వివరాలను ప్రతి వారం నివేదిక రూపంలో సమర్పించాలని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు డ్యామ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, భద్రతకు సంబంధించిన



అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలన్నారు.నీటిపారుదల పనులకు ఇసుక కొరత రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితుల వల్ల ఎదురయ్యే సమస్యలను ముందుగానే అంచనా వేసి జిల్లాలో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ కొరత తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సాగునీరు, తాగునీరు, నీటి నిల్వలు, చేపట్టిన పనుల పురోగతికి సంబంధించిన అంశాలపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు.అందోల్ నియోజకవర్గంలో పోస్ట్‌మెట్రిక్ కళాశాల



బాలికల వసతిగృహం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని మంత్రి సూచించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులకు అవసరమైన అదనపు సౌకర్యాలు, వసతిగృహాల పరిస్థితులను పరిశీలించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు విద్యావతి, జైభీమ్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ ఎస్ స్కూల్లో ఫుడ్ పాయిజన్

**మునిపల్లి సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):**

మునిపల్లి మండల్ పెద్దలోడి గ్రామంలో జడ్పీహెచ్ ఎస్ స్కూల్లో ఫుడ్ పాయిజన్ ఘటన మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈరోజు ఫుడ్ పాయిజన్ అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్ తాజా మాజీ జెడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ సంగారెడ్డి మరియు సదాశివపేట ప్రభుత్వ అసుపత్రిలో సుమారు 40 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే డి ఎం హెచ్ ఓ ని హాస్పిటల్ సూపర్డెంట్ మురలీకృష్ణ గారిని మునిపల్లి ఎంఈఓ ని హాస్పిటల్ లో కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం జరిగింది విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం, అవసరమైన అన్ని చికిత్సా సౌకర్యాలు వెంటనే అందించాలని వారు వైద్య అధికారులను కోరారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు సూచించారు.

ఘటనకు కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దలోడి సర్పంచ్ రాజు సిపిఎం నాయకులు మునిపల్లి రమేష్ మాజీ సర్పంచ్ శంకర్ పెద్దలోడి ఉప సర్పంచ్ ప్రేమానంద్ పెద్దలోడి బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు మొగులయ్య

ఖమ్మం పల్లి మాజీ ఉపసర్పంచ్ సుభాష్ నాయకులు పెద్దలుడి రాజు సుర్గ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సేవాభావంతో.. మహా అన్నదానం

- సర్పంచ్ సునీత మహిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం
- భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన సర్పంచ్ సునీత మహిపాల్
- అన్నదానంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులు, భక్తులు







**అందోల్, సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):**

కన్సాన్‌పల్లి గ్రామంలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సర్పంచ్ తెనుగు సునీత మహిపాల్ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సర్పంచ్ స్వయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు భోజనం వడ్డించారు.అన్నదానానికి ముందు మహాగణపతికి ఆనంద్ పూజారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ సునీత మహిపాల్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్తులు, భక్తులు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సునీత మహిపాల్ మాట్లాడుతూ.. వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్నదానం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని, గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను అందరి సహకారంతో కొనసాగిస్తామని తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

# విమోచనం పేరిట చరిత్రను మోసం చేయడం సిగ్గుచేటు

- రజాకార్ల అక్కృత్యాలకు వ్యతిరేకంగా పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదే
- సాయుధ పోరాటానికి ఆర్ఎస్ఎస్ బిజెపికి సంబంధం లేదు, మతాల మధ్య కొట్లాట కాదు
- సిపిఎం జహీరాబాద్ ఏరియా కార్యదర్శి బి.రాంచందర్

సీపీఎం ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు బైక్ ర్యాలీ

**జహీరాబాద్, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి న్యూస్)**

సమానత్వం సాధికారత కోసం మరో పోరాటం చేయాలని, విమోచనం పేరిట చరిత్రను మతోన్మాద శక్తులు వక్రీకరించడం సిగ్గుచేటని సిపిఎం జహీరాబాద్ ఏరియా కార్యదర్శి బి. రాంచందర్ అన్నారు. గురువారం జహీరాబాద్ లో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రజాకార్ల అక్కృత్యాలకు వ్యతిరేకంగా పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు లదేనన్నారు. సాయుధ పోరాటానికి ఆర్ఎస్ఎస్, బిజెపికి ఏ మాత్రం సంబంధం లేదన్నారు. ఇంతటి చరిత్ర కలిగిన పోరాటాన్ని హిందూ ముస్లిం మతాల మధ్య కొట్లాటగా మార్చేస్తున్నా రన్నారు. మతం పేరిట ప్రజలను చీల్చేందుకు కుట్ర చేస్తున్నా రని అన్నారు. సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టు లేనన్నారు. ఈ పోరాటానికి ఏమాత్రం సంబంధంలేని బిజెపి దాని అనుబంధ సంస్థలు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను మార్చే కుట్ర చేస్తున్నారని అన్నారు. ప్రజల్లో మత ఉద్రేకాన్ని సృష్టించి తమ ఎజెండాను అమలు చేసుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రజలందరూ మతోన్మాద భావజాలంతో ముందుకు వస్తున్న బిజెపి తప్పుడు ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాడు తెలంగాణ ప్రాంతంలో దొరలు, జాగిర్దారులు, పటేల్ పట్వారిలు, ఈ ప్రాంత ప్రజలను దోచుకు తింటూ నాటి నైజాం రజాకారుల మూకలతో కుమ్మక్క య్యారని నాడు ప్రజలను పట్టి పీడిస్తూ పన్నులను వసూలు చేయడమే కాకుండా వారి చేత వెట్టిచాకిరి చేయించారని దోపిడీ పీడనలకు వ్యతి రేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరిచి దొరలు,



జాగిర్దారులు, పటేల్, పట్వారిలకు, నైజాం రజాకార్ మూకలకు వ్యతిరేకంగా జరిపిన మహోన్నత పోరాటమే వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం హిందూ ముస్లిం మతాల తేడా లేకుండా ప్రజలంతా కలిసి పోరాడారని గుర్తు చేశారు. ఆ ఉమ్మడి మత సామరస్య, వారసత్వాన్ని ఇప్పుడు బిజెపి తమ మతోన్మాద రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. ఈరోజు దేశాన్ని ఒక మత రాజ్యంగా మార్చేయాలన్న కుట్ర జరుగుతుందన్నారు. ఇక్కడ పాలకులు ప్రజలకు అనేక రకమైన హామీలు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు పేదలకు అందడం లేదన్నారు. సాయుధ పోరాట స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో మరిన్ని బలమైన పోరాటాలు నిర్వహిస్థ మన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్ నర్సయ్య వీర గౌడ్ నాయకులు నరసింహులు సుకుమార్ బాల్రాజ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

- కొండాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో

జాతీయ జెండా ఆవిష్కరణ.

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కొండాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర చరిత్రను స్మరించుకోవడం గర్వకారణమన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆశా కార్యకర్త కుటుంబానికి ఉద్యోగం కల్పించాలి

- పెండింగ్ వేతనాలు, బీమా సొమ్ము వెంటనే చెల్లించాలి
- సీఐటీయూ వట్టపల్లి మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్

**వట్టపల్లి, సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):**

నాగులపల్లి గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త మృతి నేపథ్యంలో ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ వట్టపల్లి మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబంలో అర్హత ఉన్న ఒకరికి ఆశా కార్యకర్తగా లేదా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మృతురాలు అనేక సంవత్సరాలుగా గ్రామంలో అంకితభావంతో సేవలందించారని, కరోనా సమయంలోనూ గర్భిణుల సేవలు, ఇంటింటి సర్వేలు తదితర కార్యక్రమాల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేశారని పేర్కొన్నారు. అలాంటి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు. మృతురాలికి రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే కుటుంబ సభ్యులకు చెల్లించాలని, ఆశా కార్యకర్తలకు ఉన్న ప్రమాద బీమా సొమ్మును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తల సేవలు ఎంతో కీలకమైనవని, వారి శ్రమకు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య బీమా, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని సీఐటీయూ తరపున డిమాండ్ చేశారు.



# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**కల్హేర్, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి):**

కల్హేర్ మండలం ఖానాపూర్ (కె) తండాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞత కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు తండాల్లో సీసీ రోడ్లు, మౌలిక వసతులు అభివృద్ధి చేయడం, పలు తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తండాల అభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు కార్యక్రమాలు ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్రెడ్డి, శివరామ్ నాయక్, దేవసోతు మోతీరామ్ తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లాలో విషాదం టీచర్ తెచ్చిన పాత బిర్యానీ తిని 40 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజనింగ్!

## బర్త్‌డే వేడుకల్లో ఘోరం నిల్వ బిర్యానీ తిని విద్యార్థులకు అస్వస్థత.. భయంతో ఉపాధ్యాయుడికి గుండెపోటు!





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**





సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దలోడి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తీవ్ర ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపుతోంది. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పాఠశాల సైన్స్ టీచర్ వెంకటేశం అందించిన బిర్యానీ తిని 40 మందికి పైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.టీచర్ వెంకటేశం తన పుట్టినరోజు సందర్భంగా క్రితం రోజు రాత్రి మిగిలిపోయిన పాత బిర్యానీని ఈరోజు విద్యార్థులకు వడ్డించారు.బిర్యానీ తిన్న 50 మంది విద్యార్థుల్లో దాదాపు 40 మందికి పైగా వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో విలవిలలాడారు. బాధితులను ముందుగా మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, ఆపై మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించారు.సదాశివపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి 18 మంది విద్యార్థులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి 12 మంది విద్యార్థులు సదాశివపేట వెంకటేశ్వర ప్రైవేట్ ఆస్పత్రి 9 మంది విద్యార్థులు విద్యార్థుల పరిస్థితిని చూసి, తీవ్ర ఆందోళనకు గురైన టీచర్ వెంకటేశం సదాశివపేట ఆసుపత్రి ప్రాంగణంలోనే కుప్పకూలిపోయారు. గుండెపోటు రావడంతో ఆయనను సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉంది.బాధ్యతారాహిత్యంగా నిల్వ ఉన్న ఆహారాన్ని పిల్లలకు పెట్టిన ఉపాధ్యాయుడి తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారు తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

---

# ప్రభుత్వ కార్యాలయాల నుంచి పాఠశాలల వరకు .. ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

### - తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవం ఘనంగా నిర్వహణ సర్పంచ్.

### శశికళ తుకారాం. కోడి గంగారం కల్హ్వే ర్





**కల్హేర్, సెప్టెంబర్ 17 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్హేర్ మండలంలో గురువారం జాతీయ జెండాను ఘనంగా ఎగురవేశారు. మండలంలోని కల్హేర్, మార్డి, బీబీపేట్ తదితర గ్రామాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో విమోచన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.కల్హేర్ తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. అలాగే మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లోనూ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల పోరాటం, త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఆశీర్వాద దీపాలతో మోదీ జన్మదిన వేడుకలు

## దేశ ప్రజలకు శాంతి, సుభిక్షం కలగాలని ఆకాంక్ష




**అందోల్, సెప్టెంబర్ 17 (ప్రజాజ్యోతి):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అందోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు చౌటకూర్ మండలం సరఫ్‌పల్లి ప్రాంతంలో గురువారం సాయంత్రం ఆశీర్వాద దీపాల వెలిగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం పిలుపు మేరకు సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో నాయకులు, కార్యకర్తలు దీపాలు వెలిగించి ప్రధాని నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సరిహద్దులో సైనికుడు దేశ రక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్నట్లే ప్రధాని నరేంద్ర మోదీ దేశ సేవకు అంకితమై పనిచేస్తున్నారని అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆందోల్ నియోజకవర్గంలో ఆశీర్వాద దీపాల వెలిగింపు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి దిశగా అగ్రగామిగా అడుగులు వేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఆయన దూరదృష్టితో కూడిన నాయకత్వం కారణంగా ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో అన్ని రంగాల్లో భారత్ మరింత అభివృద్ధి సాధించి అగ్రగామి దేశంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "దేశ సేవకు అంకితమైన నాయకుడి జన్మదిన సందర్భంగా వెలిగించిన ఈ ఆశీర్వాద దీపం దేశ ప్రజలకు శాంతి, సుఖసంతోషాలు, సుభిక్షం కలగాలని కోరుతూ వెలిగించాం" అని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీకి అందోల్ బిజెపి శ్రేణులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

